క్లుప్తంగా

102 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శనివారం ఇల్లెందులోని తన చాంబర్‌లో ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను ఏరియా వారి వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ నెలకు నిర్దేశించిన లక్ష్యం 3.05 లక్షల టన్నులకు గానూ 3.29 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 102 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. 1.05 లక్షల టన్నులు బొగ్గు రైలుమార్గం ద్వారా, 0.42 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 2.00 లక్షల టన్నులు బొగ్గు బట్వాడా చేయటం జరిగిందన్నారు. ఏప్రిల్‌లో 28 ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేశామని వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలని, అందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఏరియాను అగ్రస్థానంలో ఉద్యోగులను, సూపర్‌వైజర్లను అధికారులను, యూనియన్ నాయకులను అభినందించారు.

రేపు ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో 6వ తేదీన మాస శివరాత్రి సందర్భంగా రుద్ర హోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో సోమవారం ఉదయం 9 గంటల యాగశాలలో హోమం నిర్వహించనున్నారని, పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,516 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9866923261 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి


విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి మల్లికార్జున్

ఇల్లెందురూరల్: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో భద్రాద్రి సర్కిల్ నోడల్ అధికారి మల్లికార్జున్ సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో డ్యామేజ్ పోల్స్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, లైట్నింగ్ అరెస్టర్స్ తదితరాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలను నివారించండి

కొత్తగూడెంఅర్బన్: నియోజకవర్గంలో అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని ఖమ్మం బహుజన్ సమాజ్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి యెర్రా కామేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయని చంటి పిల్లలు, వృద్ధులు ఉక్కపోతలకు తాళలేకపోతున్నారని రోజుకు 20 సార్లకు పైగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు లేవని, కొత్తగూడెంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. అధికారులు, కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

విస్మరించిన చేదబావులే దిక్కు

భానుడు ప్రచండుడిలా తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండవేడిమికి ఎక్కడి నీరు అక్కడే ఇంకిపోతోంది. ఫలితంగా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే ప్రమాదాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలకు ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో పైపులైన్లు, బోర్లు వేయడం వరకు బాగానే ఉన్నా నీటి లభ్యత అధికారులకు సవాల్‌గా మారింది. ఈ సమస్యకు గ్రామాలలో తాగునీటి కోసం తవ్విన పురాతన చేదబావులు నేడు అధికారులకు పరిష్కారం చూపాయి. యుద్ధ ప్రాతిపదికన బావుల పునరుద్ధరణకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

- నీటి ఎద్దడికి పరిష్కారం చూపుతున్న పురాతన బావులు
- పూడికతీత తీసి మోటార్లు బిగిస్తున్న అధికారులు


బ్రిటీష్‌కాలం నాటి బావిలో పూడిక తీయిస్తున్న మొండితోగు గ్రామపంచాయతీ అధికారులు

ఇల్లెందురూరల్: దశాబ్దాల క్రితం పల్లెల్లో తాగునీటి పథకాలు ఉండేవి కావు. గ్రామంలో నీటి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి గ్రామ అవసరాలకు అనుగుణంగా ఒకటి, రెండు బావులను తవ్వించారు. వాటి చుట్టూ రాతికట్టడాలతో బావులను సుందరంగా తీర్చిదిద్దారు. తాడు సహాయంతో బకెట్లతో నీళ్లు తోడుకునేందుకు గిలకలు అమర్చేవారు. ఒకేసారి నాలుగువైపులా నలుగురు నీళ్లు తోడుకునేలా సౌకర్యవంతంగా ఉండేవి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మహిళలు బావుల వద్దకు వచ్చి ఇంటి అవసరాలకు నీటిని తోడుకుని వెళ్లేవారు. ఇలాంటి చేదబావులు సుమారు వందేళ్ల క్రితం నాటివి కూడా నేడు గ్రామాలలో దర్శనమిస్తున్నాయి. నాడు ఆ బావులే గ్రామీణ ప్రజలకు ప్రధాన తాగునీటి వనరుగా ఉండేవి.

నేడు ప్రత్యామ్నాయంగా అవే బావులు..

పల్లెల్లో ఏటేటా జనాభా పెరుగుతూ వస్తోంది. జనాభాకు అనుగుణంగా నీటి వాడకమూ పెరుగుతూ వచ్చింది. చేద బావుల్లోని నీటిని తోడేందుకు మహిళలు పడుతున్న కష్టాలను చూసిన ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెల్లో బోర్లు వేయించి, పైపులైన్లు వేసి రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించారు. వీధులలో నల్లాలు సైతం బిగించారు. దీంతో గ్రామాలలో క్రమంగా చేదబావులను వాడటం మానేశారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి రావడంతో బావులతోపాటు బోర్లు కూడా చాలావరకు మూగబోయాయి. కానీ ప్రస్తుతం భానుడి ప్రతాపానికి నీటి కష్టాలు ప్రారంభం కావడంతో ఆ పాత మధురం.. అన్నట్లుగా నీటి ఎద్దడిని అధిగమించేందుకు పురాతన చేదబావుల వైపు అధికారులు పరుగులు తీస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటేనే..

దశాబ్దాలుగా ఉపయోగించకుండా వదిలేసిన పురాతన బావులను నేడు వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కరసత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాలలో 15 బావులను వినియోగంలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు పూర్తికాగా మరో 15బావులను కొద్దిపాటి మరమ్మతులు అవసరమని గుర్తించిన అధికారులు ఆ దిశగా పనులు ప్రారంభించారు. అయితే ఇంతకాలం పడావుపడ్డ బావులలో పూడికతీతతోపాటు క్లోరినేషన్ వంటి పనులు చేయిస్తేనే ఆ బావులలోని నీరు వినియోగానికి వీలుగా ఉంటుంది. ఆ దిశగా అదికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సుదిమళ్లలో పురాతన బావిలో నీటిని తోడుతున్న పంచాయతీ సిబ్బంది

ఆ రోజుల్లో చేదబావులే..



నా చిన్నతనంలో తాగునీటి అవసరాల కోసం గ్రామంలో చేద బావులు తవ్వించారు. ఆ బావుల నుంచే నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకునేవాళ్లం. దశాబ్దాలపాటు ఆ బావులే నీటి అవసరాలు తీర్చాయి. మండుటెండల్లో సైతం నీరు పుష్కలంగా లభించేంది. అప్పట్లో నీటి కరువు అంటేనే తెలియదు. ఇప్పుడు తాగునీటి పథకాల నిర్మాణంతో వినియోగం లేక బావుల పడావుపడ్డాయి.

– పాపయ్య, మాజీ సర్పంచ్, హనుమంతులపాడు

తాగునీటి ఎద్దడికి ప్రత్యామ్నాయం..



మండుతున్న ఎండల కారణంగా గ్రామాలలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యామ్నాయంగా తక్షణ చర్యలు ప్రారంభించాం. మండలంలో 30 పురాతన బావులను గుర్తించాం. ప్రస్తుతం 15బావులు వినియోగించేందుకు వీలుగా తీర్చిద్దాం. మరో 15 బావుల పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాం. అందరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బాలాజీ, డీఈ, మిషన్ భగీరథ గ్రిడ్, ఇల్లెందు

నీటిని క్లోరినేషన్ చేయాలి



గ్రామాలలో పురాతన బావులను వినియోగంలోకి తేవడం మంచి పరిణామం. కానీ ఏళ్ల తరబడి పడావుపడ్డ బావులలో క్రిమికీటకాలు చేరి నీటిని మలినం చేసే అవకాశం ఉంటంది. ముందుగా బావులలో నీటిని పూర్తిగా తొలగించి బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రం చేయించాలి. ఒకసారి నీటిని క్లోరినేషన్ చేసి వినియోగిస్తే మంచిది. లేదంటే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ

ఆలయానికి రూ.1,11,111 విరాళం


విరాళం అందజేసిన సమితబ్ సర్కార్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు, అర్చకులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని సింగరేణి జీఎం కార్యాలయం – మహబూబాబాద్ క్రాస్ రోడ్ వద్ద అరుదైన ఆలయం సువర్చలా సహిత అభయాంజనేయ స్వామికి ఓ భక్తుడు తన భక్తి పారవశ్యం చాటుకున్నాడు. గత నవంబర్‌లో ఈ ఆలయాన్ని దర్శించుకున్న పౌర విమాన మంత్రిత్వ శాఖ ఉద్యోగి సమితబ్ సర్కార్ కోరుకున్న కోరిక నేరవేరడంతో శనివారం ఆలయాన్ని సందర్శించి మొక్కు తీర్చుకున్నాడు. ఈ మేరకు రూ.1,11, 111 విరాళం అందజేశాడు. తన కల సాకారం కావటంతో మరోమారు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పూజారి శ్రీనివాసాచార్యులు తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, దాట్ల వెంకటేశ్వర్లు, కామరాజు, ధనాల శ్రీనివాస్, సొప్పరి సాంబయ్య పాల్గొన్నారు.

వర్షంతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి


తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

పాల్వంచరూరల్: ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి ఇళ్లు కూలి, పైకప్పులు ఎగిరిపోవడంతో నష్టపోయిన ఆదివాసీ గిరిజనులను ఆదుకోవాలని ఐఎఫ్టీయూ నాయకుడు నిమ్మల రాంబాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో కలిసి శనివారం తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... సీతారాంపురంలో శుక్రవారం సాయంత్రం గాలివాన కారణంగా 18మంది గిరిజనులకు చెందిన ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి, ఇళ్ల గోడలు కూలిపోయి నష్టం వాటిల్లిందని తెలిపారు.

నష్టపోయిన గిరిజనులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. నీలం భాస్కర్, బాధిత గిరిజనులు మడివి దేవా, ముచ్కి గంగ, రవ్వ అంజలి, సునీల్, సుక్కమ్మ, భారతి, నరేష్, ఉమేష్, మంగమ్మ, ఉంగ తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో పనివేళలు మార్చాలి..


డిప్యూటీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది

ఇల్లెందు/టేకులపల్లి: ఓపెన్‌కాస్టు గనుల్లో పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం యూనియన్ ఆధ్వర్యంలో కోయగూడెం ఓపెన్‌కాస్టులో పనివేళలు మార్చాలని కార్మికులు జేకేఓసీ, సీహెచ్‌పీ, ఏరియా వర్క్ షాప్, కేఓసీ, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్లలో ధర్నాలు నిర్వహించారు. డిప్యూటీ మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా కోల్‌బెల్ట్ ఏరియాలో ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయని, ఈ కారణంగా కార్మికులు అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొంగర వెంకటేశ్వర్లు, కాలే పుల్లయ్య, శ్రీనివాస్, షేక్ సర్వర్, సామల శ్రీనివాస్, సకినాల రాజేష్, రంజిత్, బాషబోయిన అశోక్, వెంగళ రవి, పెరుగు భాస్కర్, వెంకటనర్సయ్య, నాగేశ్వరరావు, బొటిక శ్రీనివాస్, ధర్మసింగ్, రాజయ్య, రవికుమార్, మూతి శ్రీనివాస్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

ఇంటినుంచి ఓటు వేసిన వృద్ధులు




నర్సంపేటలో పుల్లమ్మ, దంతలబోరులో... పుల్లమ్మ, కొత్తూరులో చుక్కమ్మ

పాల్వంచరూరల్: ఓటు ఫ్రం హోమ్ విధానంలో భాగంగా శనివారం పాల్వంచ మండలంలో గుర్తించిన మొత్తం 18 మంది వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పాండురంగాపురం పంచాయతీ నర్సంపేట గ్రామానికి చెందిన 90 సంవత్సరాల పెరుగు పుల్లమ్మ, ఉల్వనూరు పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన 88 కాలం చుక్కమ్మ, దంతలబోరు గ్రామానికి చెందిన 88సంవత్సరాల బాసిపోయిన పుల్లమ్మలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియను ఆర్డీఓ మధు పర్యవేక్షించగా సెక్టోరియల్ అధికారి శంకర్, పోలింగ్ ఆఫీసర్లు ప్రభాకర్‌రావు, కౌసల్య, శంకర్‌రావు, ఆర్ఐ.హచ్యా పాల్గొన్నారు.

ఘనంగా ఈద్‌మిలాప్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్లైన్‌లో శనివారం ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ... ఈద్‌మిలాప్ ప్రాముఖ్యతను సమాజంలో మన నడవడిక గురించి వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన సోదరభావం పెరిగి సుఖసంతోసాలతో జీవనం సాగించడానికి తొడ్పడతాయన్నారు. మానవ సమాజంలో ఉన్న అన్ని గ్రంథాలు చెప్పే సూక్తులు ఒకటేనన్నారు. మనం వాటిని ఆచరణలో చూపుతున్న విధానాలు వేరని, ఏ గ్రంథమైనా మానవ జీవితం ప్రశాంతతతో కలిగి ఉండాలంటుందన్నారు. కొంతమంది వాటిని విపులీకరించి బంధాలను విడదీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అబ్దుల్ బాసిత్, జహంగీర్, హుమాయిన్, ఎండీ ఆసీఫ్, ఎండీ షకీల్, ఉమర్‌ఫారుక్, రఫీ, మున్వర్, అజ్మతుల్లా, ఖాజ, నయిం, ఉమర్ ఫారుక్, జమీర్, జామీర్ పాల్గొన్నారు.

మురళీకృష్ణను గెలిపించండి


ప్రచారం చేస్తున్న హర్య

టేకులపల్లి: 13న జరగబోవు పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటేసి గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకుడు భూక్యా హర్య, నోముల భానుచందర్ కోరారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండలంలో ప్రచార జీపుతో టేకులపల్లి వార సంత, బద్దుతండ, కుంటల పంచాయతీలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. పదేళ్లుగా ప్రజలు సొమ్మును జీఎస్టీ రూపంలో దండుకుని పెట్టుబడుదారులకు కట్టబెడుతూ, రూ.వేలకోట్ల బ్యాంకు అప్పులు రద్దు చేశారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, రిజర్వేషన్లు రద్దు చేసి కిందిస్థాయి ప్రజలకు ఉద్యోగ అవకాశాల్లేకుండా చెస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో బీజేపీ ఉందని, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. భూమి, భుక్తి, కూడు, గుడ్డకై పేద ప్రజల సమస్యల కోసం పోరాడే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీని అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా నర్సింగ్, తోటకూరి సతీష్, లక్ష్మణ్, భీక్యా, నాగేశ్వరరావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయండి


ప్రశాంత్‌నాయక్‌కు నియామకపత్రం అందజేస్తున్న రంగాకిరణ్

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోదరావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో కార్మికులను కలిసి కోరారు. 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేష్, గంధం నాగేంద్రప్రసాద్, రవినాయక్, గంగపురి దుర్గాప్రసాద్, మురళి, నరేష్, అవినాష్, వంశీ పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శిగా ప్రశాంత్

స్థానిక పట్టానికి చెందిన మాలోతు ప్రశాంత్‌నాయక్‌ను బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ నియామకపత్రాన్ని శనివారం అందజేశారు.

వానాకాలం వస్తే వాగుతో అవస్థలు

- వర్షం పడితే రాకపోకలు బంద్
- గరీబ్‌పేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్యలో చింతల వాగు
- వంతెన నిర్మాణం కోసం ఎదురుచూపులు


వాగు దాటుతున్న స్థానికులు (ఫైల్)

సుజాతనగర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, గరీబ్‌పేట గ్రామాల మధ్యలో ప్రవహిస్తున్న చింతల వాగు ప్రతీ వర్షాకాలంలో ప్రయాణికులు, గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు పారుతోంది. దీంతో ప్రాణాలకు తెగించి నీటి ప్రవాహంలోనే ప్రయాణాలు చేయడం లేదా రాకపోకలు నిలిచిపోవడం జరుగుతోంది. ఏళ్లుగా సమస్య వేధిస్తున్నా అధికారులు మాత్రం సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ఈ కాల్వపై వంతెన నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద వస్తే ఎక్కడివారు అక్కడే..

ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు ఈ వాగు పారుతోంది. ఎగువన ఉన్న గరీబ్‌పేట, నిమ్మలగూడెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ కాలువ గుండానే వెళ్లాలి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతోపాటు కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. అటువైపుగా ఉన్న గ్రామ ప్రజలు ఇటువైపు.. ఇటువైపు వారు అటువైపు.. వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాలి..

లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని కొంతమంది రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటే ఈ వాగుపై మీద నిర్మించిన చప్టా పైనుంచే వెళ్లాలి. వర్షాకాలం పంట పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ సామగ్రి తరలించాలన్నా, పండిన పంటలు ఇంటికి చేర్చాలన్నా రైతులు అవస్థలు పడుతున్నారు.

గరీబ్‌పేట గ్రామస్తులు మండల కేంద్రం సుజాతనగర్ రావాలంటే ఈ రహదారి గుండా వస్తే తక్కువ దూరం కావడంతో నిత్యం వాహనాలు ఇలానే వస్తుంటాయి. ప్రతీ వర్షాకాలంలోనూ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వరద అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు చొరవ తీసుకుని ఈ వాగుపై వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపితేనే ఆయా గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లా, మండల అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణం చేపట్టాలని లక్ష్మీదేవిపల్లి, గరీబ్‌పేట గ్రామస్తులతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రవాణా కష్టాలు తీరుతాయి.

వంతెన నిర్మించాలి...



వర్షాకాలంలో వాగు పారితే వరద తగ్గేంత వరకు ఆగాల్సి వస్తోంది. గతంలో ఒకరు వరద ప్రవాహంలో కొట్టుకొని పోగా ప్రాణాలకు తెగించి కాపాడాం. వరద వచ్చిన సమయంలో పశువులు, గొర్రెలు, మేకలు కొట్టుకొని పోతుంటాయి.

– బానోత్ కోటేష్, లక్ష్మీదేవిపల్లి

వర్షం పడితే రాకపోకలు బంద్..



ఏపాటి కొంచెం వర్షం వచ్చినా చప్టాపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు ప్రయాణం ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వాగు దాటి పొలాలకు వెళ్లాల్సిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– బానోత్ నరేష్, లక్ష్మీదేవిపల్లి

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


కొత్తగూడెంఅర్బన్: స్టేడియంకు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు


సీఎంకు చిత్రపటం అందజేస్తున్న నాయకులు


జూలూరుపాడు: కాకర్ల నుంచి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శనివారం జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు పట్టణంలోని వార్డుల నుంచి ర్యాలీలు, నినాదాలు చేసుకుంటూ సభ ప్రాంగణానికి ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఇటీవల పట్టణంలోని వార్డుల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిన వారు ర్యాలీ నిర్వహించారు.

సీఎం చిత్రపటం అందజేసిన నాయకులు..

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన జన జాతర సభకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రావు సీఎం చిత్రపటాన్ని సీఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు ఉన్నారు.

ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు..

కొత్తగూడెంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జన జాతర సభను విజయవంతం చేసిన ప్రతీఒక్కరికి రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జూలూరుపాడు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన కాంగ్రెస్ జనజాతర సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. శనివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్ కుమార్, బానోత్ స్వాతి, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, వేల్పుల నరసింహారావు, బానోత్ లాలు నాయక్, యల్లంకి పుల్లయ్య, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, రోకటి సురేష్, సున్నా కృష్ణయ్య, దుద్దుకూరి సుమంత్, నరసింహారావు, నర్వనేని పుల్లారావు, బానోత్ ధర్మా తదితరులు ఉన్నారు.